క్లుప్తంగా

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్



నగరంలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం 10 మంది లబ్ధిదారులకు రూ.5.33 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. కేతా శ్రీను, కొల్లాటి వెంకట్రావు, కుంపట్ల గోపి, యల్లమెల్లి శ్రీను, మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం



సత్యనారాయణకు నగదు అందజేస్తున్న కలెక్టర్

అంబాజీపేట: హెర్నీయా వ్యాధితో బాధపడుతున్న ఏడాది బాబు నేర్లగంటి షణ్ముఖ్ వెంకట్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం వలంటీర్లు ఆర్థిక సాయాన్ని అందించారు. జిల్లా వలంటీర్ జేఏసీ తరఫున సమకూర్చిన రూ.15 వేలను సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా ఆ బాబు తండ్రి సత్యనారాయణకు అందజేశారు. జిల్లా వలంటీర్ జేఏసీ నాయకులు స్వామి, సూర్య, నాగలక్ష్మి, సాయి, చిట్టిబాబు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సంధ్యారాణికి ప్రథమ స్థానం

రావులపాలెం: విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రోకిక్ బాక్సింగ్ సీనియర్ లీగ్‌లో రావులపాలెనికి చెందిన వీటి సంధ్యారాణి ప్రథమ స్థానంలో నిలిచినట్టు కోనసీమ జిల్లా కిక్ బాక్సింగ్ సెక్రటరీ ఈ సత్యశ్రీ సోమవారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖపట్నం బీచ్ రోడ్డులో, విశాఖపట్నం కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహించిన సీనియర్ రాష్ట్రస్థాయి ప్రో కిక్ బాక్సింగ్ లీగ్ సీనియర్స్ పోటీల్లో రావులపాలెం సత్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థిని వీటి సంధ్యారాణి 57 కేజీ మహిళా విభాగంలో పాల్గొని ప్రథమ స్థానం సాధించి బెల్ట్‌ను కైవసం చేసుకుందన్నారు. బహుమతి ప్రదానం రాష్ట్ర కిక్ బాక్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రెటరీ బి.శామ్యూల్ రాజ్ చేతుల మీదగా బెల్ట్ అందుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ టెంకి దుర్గ, జిల్లా సెక్రెటరీ గుడాల రాంప్రసాద్, టెక్నికల్ ఇన్‌చార్జి నారాయణరావు, కిక్ బాక్సింగ్ మాస్టర్స్ పాల్గొన్నట్టు సత్యశ్రీ తెలిపారు.

మేదర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రావులపాలెం: మేదర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన మహేంద్ర (మేదర్ల) ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మెదర్ల సంఘ ప్రతినిధులు దేశంలో అన్ని రాష్ట్రాలలో మేదర్లు ఎస్టీలుగా ఉన్నారని, తెలుగు రాష్ట్రాలలో కూడా ఎస్టీలలో చేర్చాలని, తమ కోర్కెను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ మేదర్లు అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చామని, మేదర్ల సంఘానికి కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

పి.గన్నవరం: స్థానిక చుట్టుగుల్లవారిపేటలో ఆదివారం రాత్రి పాముకాటుకు గురై ఒక యువకుడు మృతి చెందాడు. ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక గ్రామానికి చెందిన గెద్దాడ నరేష్(25) ఇటీవల తన అమ్మమ్మ అనారోగ్యానికి గురవడంతో ఆమెను చూసేందుకు పి.గన్నవరం శివారు చుట్టుగుల్లవారిపేటకు వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి లఘుశంక తీర్చుకునేందుకు మేనమామ చుట్టుగుల్ల నాగరాజుతో కలిసి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో నరేష్ కాలుపై విష సర్పం కాటు వేయడంతో అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మేనమామ అతడిని హుటాహుటిన పి.గన్నవరం సీహెచ్‌సీకి తీసుకువచ్చాడు. పరిస్థితి విషమించడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా దారిలో మృతి చెందాడు. నరేష్ మృతదేహానికి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మేనమామ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి వివరించారు.

పేరెంట్స్ కమిటీ సమావేశం

ఆలమూరు: స్థానిక ఖండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవరం పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిల్లి రాంబాబు పాల్గొని విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సమగ్రంగా వివరించారు.

హామీలు నెరవేర్చాం.. ధైర్యంగా వస్తున్నాం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- పెదపట్నంలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెదపట్నంలంకలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ఉయ్యూరువారి మెరకలో పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మామిడికుదురు: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నంలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గతంలో సంక్షేమం కొన్ని కులాలకే పరిమితం కాగా దాన్ని అందరికీ అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ సర్కారుకే దక్కిందన్నారు. బాధ్యతాయుతమైన రాజకీయం చేస్తూ ముందుకు వెళ్తున్నామని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, పార్టీ నేతలు కొమ్ముల సూరిబాబు, తులా గోపాలకృష్ణ, గెద్దం వెంకటేశ్వరరావు, లంకే దుర్గ, బందారు బాబులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రయోజనం: రాపాక

సఖినేటిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ మరింత ప్రయోజనం ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం ఉయ్యూరువారి మెరకలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీలు ఇంజేటి కృష్ణవేణి, గుబ్బల ఆంజనేయులు, ఉపసర్పంచ్ చెంపాటి రామకృష్ణంరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి నాగేశ్వరరావు, నాయకులు చింతా సుధాకర్‌రావు, ఓగూరి బాబులు, ఇంజేటి విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పనపల్లి అప్రోచ్ రోడ్డును బాగుజేశారు

సాక్షి ఇంపాక్ట్



అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మామిడికుదురు: మామిడికుదురు–అప్పనపల్లి ఉచ్చులవారిపేట అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అప్రోచ్ రోడ్డు బురదమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తీరును వివరిస్తూ 'బురదగా మారిన రోడ్డు.. తప్పని ఇబ్బందులు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి ఈ చర్యలు చేపట్టారు. బురదమయంగా మారిన అప్రోచ్ రోడ్డుపై మెటల్ వేసి ప్రయాణికుల కష్టాలు తీర్చారు. పాటురేవు పాయపై శ్లాబ్ కల్వర్టు నిర్మాణంలో ఉంది. కల్వర్టు నిర్మాణం పూర్తయినా బెర్మ్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు అనువుగా అప్రోచ్ రోడ్డు వేశారు. అది కాస్తా వర్షానికి చిత్తడిగా మారడంతో ఇబ్బందులు తలెత్తాయి. వాటిని చక్కదిద్దిన అధికారులు ప్రయాణికుల అవస్థలకు చెక్ పెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీజేపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలోకి చేశారు. సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామం గోపాలపురంలోని ఆయన ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో కొత్తపేట గ్రామం ఆర్కే నగర్ బీజేపీ పార్టీకి చెందిన ఎలిశెట్టి రామారావు, అదే గ్రామం ముద్రగడ వారి వీధిలో జనసేన పార్టీకి చెందిన ముద్రగడ రామ కోటేశ్వరరావు, భార్యాభర్తలు ధరణాల మల్లేశ్వరరావు, దుర్గాలక్ష్మి, కృష్ణమూర్తి నగర్ నుంచి ర్యాలి చంద్రరావు తదితరులు పార్టీలో చేరారు. వీరికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సలాది బ్రహ్మాజీ, పేపకాయల బ్రహ్మానందం, సలాది వెంకటానందం (మమాజీ)ల ఆధ్వర్యంలో చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కళారంగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

ప్రముఖ అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వుడయార్



కొత్తపేటలో కుశుడు సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న శిల్పి వుడయార్, డాక్టర్ శేషుబాబు, పాలూరి తదితరులు

కొత్తపేట: రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరించిన కళా రంగానికి నేటి ప్రభుత్వాలు అదే రీతిలో అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించాలని ప్రముఖ అంతర్జాతీ శిల్పి, శిల్పకళా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డి.రాజ్ కుమార్ వుడయార్ కోరారు. స్థానిక పాట్టి శ్రీరాముల వీధి వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నాటి లవకుశ చిత్రంలో కుసుడు పాత్రధారి ఉయ్యూరి నాగసుబ్రహ్మణ్యం, విద్యా రంగంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం, కూచిపూడి నాట్య కళాకారిణి రావి బేబీసత్యవాణి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం అధ్యక్షతన జరిగిన సభలో శిల్పి రాజ్ కుమార్, స్థానిక ప్రముఖ వైద్యుడు డాక్టర్ కాశిన గేయానందశేషుబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచీ విద్య, క్రీడా రంగాలతో పాటు సాంస్కృతిక రంగంపై విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. నాటి లవకుశ సినిమా తెలుగు సినీ రంగానికి ప్రపంచ వ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిందన్నారు. అందులో నటించిన కళాకారుని తీసుకువచ్చి సత్కరించడం అభినందనీయమన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యాన్ని కమిటీ తరఫున అతిథులు శాలువా, నూతన వస్త్రాలు, భారీ గజమాల, మెమెంటోతో ఘనంగా తస్కరించారు. అలాగే 402 ప్రదర్శనలు ఇచ్చిన కూచిపూడి నృత్య కళాకారిణి సత్యవాణి, ఫార్మసీ ఎంట్రన్స్‌లో జాతీయస్థాయి ర్యాంక్ సాధించిన కంకటాల పద్మనాగహైమ, ఎంసెట్‌లో ర్యాంక్ సాధించిన గాది అంబికా శ్రీరామ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలూరి వెంకటలక్ష్మి, నటరాజ కళాసమితి అధ్యక్షుడు నల్లా సత్యనారాయణమూర్తి, కళాసాహితి సభ్యుడు షేక్ గౌస్, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కే సత్యనారాయణ, కమిటీ కన్వీనర్ వానపల్లి సుబ్బారావు, సభ్యులు పాలూరి జయప్రకాష్ నారాయణ, శ్రీకాకోళపు చిన్ని, శ్రీనివాసరావు, బొడ్డు సుబ్రహ్మణ్యం, కోసూరి సత్తిబాబు, గ్రంధి నానాజీ, కొత్త సాయి, నల్లా గోపి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం

అంబాజీపేట: చిన్న చిన్న కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి జగనన్న సురక్ష కార్యక్రమంలో వారందరికీ న్యాయం చేయాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి పెదబాబు కోరారు. వక్కలంక గ్రామ సచివాలయం వద్ద కార్యదర్శి తాతాజీ అధ్యక్షతన జగనన్న సురక్ష పథకంపై సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు అవగాహన కల్పించారు.

అంబాజీపేట: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారులు అన్నారు. 1న పసుపల్లి, ముక్కామల, 4న వక్కలంక, ఇరుసుమండ, 7న పుల్లేటికుర్రు-1, 2, 11న కె.పెదపూడి, చిరతపూడి, 13న ఉసుకపూడి, మొసలపల్లి, 15న గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, 18న మాచవరం-1, 2, 20న మాచవరం 3, 4, 22న నందంపూడి, తొండవరం, 25న వాకలగరువు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆత్రేయపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని జూలై ఒకటో తేదీ నుంచి 25 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. ఆ మేరకు గ్రామాల వారిగా జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించేందుకు తహసీల్దారు, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలతో బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడమే లక్ష్యం



వానపల్లిలో ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు తదితరులు

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడం ద్వారా వారు ఉత్తమ ఫలితాలు సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని వానపల్లి, తొత్తుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో ఉత్తమ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథుగా పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గమిడి రత్ననాగసాయిలక్ష్మీపద్మిని, సబ్బితి వెంకటమౌనికజ్యోత్స్నశ్రీ, కాల వర్షిత (వానపల్లి), బొక్కా మహాలక్ష్మి, రెడ్డి హరిసత్యశేఖర్, గదా ధనరాజు (తొత్తుపాడు)లను శాలువాలతో సత్కరించి, పతకాలు, వరుసగా రూ 3,000, రూ 2,000, రూ 1,000 చొప్పున నగదును ఎంపీపీ గంగాధరరావు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బళ్ల సుధారాణి, పీఎంసీ చైర్మన్‌లు వాసంశెట్టి వీరాస్వామి, రెడ్డి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుస్సలపూడి మాధవరావు, హెచ్‌ఎం కడలి సత్యనారాయణ,సీఆర్‌పీ జేవీ సత్యనారాయణ తధితరులు పాల్గొన్నారు.

నేడు శాకాంబరిగా నూకాంబిక అమ్మవారు

ఆలమూరు: చింతలూరులో ఉన్న నూకాంబిక అమ్మవారు మంగళవారం శాకాంబరిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ వుండవిల్లి వీర్రాజు పర్యవేక్షణలో దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

'రౌతు'కు నేషనల్ హ్యూమన్ రైట్స్ బెస్ట్ అవార్డు



బెస్ట్ అవార్డు అందుకున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యదర్శి రౌతు ఈశ్వరరావు

రావులపాలెం: నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రావులపాలెంకు చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రౌతు ఈశ్వరరావుకు బెస్ట్ అవార్డు వచ్చినట్టు సోమవారం ఆయన తెలిపారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నేషనల్ బెస్ట్ అవార్డు కార్యక్రమం ఈ నెల 25వ తేదీన విజయవాడలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వైడ్‌గా ఉత్తమ అవార్డుకు కోనసీమ జిల్లాకు చెందిన తనను ఎంపిక చేసి చైర్మన్ సంపత్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందచి శాలువా కప్పి సత్కరించారని ఈశ్వరరావు తెలిపారు.

మెడిసిన్ ర్యాంకర్‌కు ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అభినందన



ఆశ్రితను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తదితరులు

ఆలమూరు: చొప్పెల్లకు చెందిన కోలాటి ఆశ్రిత రాష్ట్ర ఎంసెట్ (మెడిసిన్) 578 ర్యాంకు సాధించిగా జాతీయ స్థాయి నీట్ పరీక్షల్లో ఓపెన్ కేటగిరీలో 40,678 ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం ఆ విద్యార్థిని నివాసానికి వెళ్లి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలను తెలియజేసి తల్లిదండ్రులను అభినందించారు. ఆశ్రితకు ప్రోత్సాహక బహుమతి క్రింద రూ.పది వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ, ఉప సర్పంచ్ సుంకర కామరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి దియ్యన పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఎమ్మెల్యే అభినందన

రావులపాలెం: స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కొండ్రు హేమ సత్య వరప్రసాద్ స్కేటింగ్ రేంజర్స్ అకాడమీ తరపున పాల్గొని అండర్-11 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. జాతీయ స్థాయిలో కరాటేలో అండర్-11 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. వరప్రసాద్ తల్లిదండ్రులు సతీష్ కుమార్, తల్లి పద్మ కుమారి గోపాలపురం సచివాలయం-1లో ఏఎన్ఎం విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో చిన్నారి సత్య వరప్రసాద్‌ను, తల్లిదండ్రులను ఆయన అభినందించి, శాలువాతో సత్కరించారు. అలాగే రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

ఇమామ్ బాఖర్‌కు ఘన నివాళి

మామిడికుదురు: ముస్లింల ఐదో ప్రవక్త ఇమామ్ హజరత్ మహ్మద్ బాఖర్‌కు ఆదివారం రాత్రి ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. బాఖర్ షహదత్‌ను పురస్కరించుకుని నగరంలోని బార్గాహే పంజతన్‌లో మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకులు సయ్యద్ నిస్సార్ హైదర్ మజ్లిస్ ఆలపించారు. ఆ సందర్భంగా గుమ్మటాన్ని తీసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మీర్ జుల్ఫికర్ ఆధ్వర్యంలో షహదత్ కార్యక్రమాలు జరిగాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గుమ్మటాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పెద పంజీషా వరకు గుమ్మటాన్ని ఊరేగిస్తూ గుండెలు బాదుకుని మాతం నిర్వహించారు. పంజీషా ముత్తావలి కల్బేఆబేద్ మాజిండ్రాణితో పాటు పలువురు పెద్దలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేసి..

కొత్తపేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి తీరా పెళ్లి చేసుకోమంటే ముఖం చాటేసిన యువకుడిపై బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక బాబానగర్‌కు చెందిన 17 సంవత్సరాల బాలిక ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మెట్టి సురేష్ నిన్ను ప్రేమిస్తున్నానని ఆమె వెంటపడేవాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. శారీరకంగా అనుభవించి తల్లిని చేశాడు. అయితే మా అమ్మ కువైట్‌లో ఉందని, వచ్చిన తరువాత ఒప్పించి పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఇదిలా ఉండగా తాను గర్భం దాల్చానని పెళ్లి చేసుకోమని అడగ్గా గర్భం తీయించేస్తాను. తరువాత పెళ్లి చేసుకుంటాను. లేకుంటే పెళ్లి చేసుకోను అని చెప్పి, అతనితో పాటు అతను కుటుంబ సభ్యులు బలవంతంగా ఈ నెల 19న ఉదయం 9 గంటలకు స్థానిక ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి అబార్షన్ చేయించారు. ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని భయపెట్టారు. బాలికకు నీరసం ఉండి, రక్తస్రావం అవడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. దాంతో ఆమె కుటుంబ సభ్యులు యువకుడి కుటుంబ సభ్యులను పెళ్లి విషయమై అడగ్గా పెళ్లి చేసుకునేది లేదు, నీ దిక్కున్నచోట చెప్పుకోమని అన్నారు. దానితో బాలిక పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. దీనిపై రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్‌ను సాక్షి వివరణ కోరగా మైనర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తామన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

మామిడికుదురు: బీజేపీ గృహ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఆ పార్టీ నేతలు సోమవారం ఈదరాడలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, అడబాల రాంబాబు, అడపా వెంకటరత్నం, దొరబాబు, తాతయ్యనాయుడు తదితరలు పాల్గొన్నారు.

వాడపాలెం చానల్‌కు నీరు విడుదల



వాడపాలెం చానల్‌కు నీరు విడుదల చేస్తున్న ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్(తొలకరి) సీజన్‌లో రైతులు వరినాట్లు త్వరగా వేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి త్రిమూర్తిశ్రీనివాస్ సూచించారు. వాడపాలెం లాకుల పైన వాడపాలెం న్యూ చానల్ కింద సుమారు 1400 ఎకరాలకు సాగునీటిని విడుదలన చేశారు. స్థానిక ఇరిగేషన్ ఏఈ వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఏబీ చైర్మన్ పెదపూడి త్రిమూర్తిశ్రీనివాస్ చానల్‌కు సోమవారం నీటిని విడుదల చేశారు. చానల్స్‌లో తూటు, తుక్కు, పూడికతో నిండిపోవడంతో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సాగునీరు అందేది కాదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దాంతో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు రూ.4 లక్షలు మంజూరు కాగా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాడపాలెం రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నేడు ప్రజావేదిక

పి.గన్నవరం: మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు గత కొన్ని రోజులుగా విచారణ నిర్వహించాయి. దీనిపై మంగళవారం పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది హాజరు కావాలన్నారు.

లక్కవరం పశువైద్యాధికారిగా రాజు

మలికిపురం: మండలంలోని లక్కవరం పశువైద్యాధికారిగా డాక్టర్ పీఎస్ఎస్ రాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు పశువైద్యశాలలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

చొప్పెల్ల వైద్యాధికారిగా మల్లికార్జున

ఆలమూరు: చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ డి.మల్లికార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ వైద్యాధికారిగా సేవలందించిన డాక్టర్ ఎం.సుమలత కొత్తపేట మండలంలోని అవిడి పీహెచ్‌సీకి వెళ్లారు. బాపట్ల జిల్లా బాపట్ల మండలం జె.పాంగులూరు పీహెచ్‌సీ నుంచి మల్లికార్జున బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం

ఆలమూరు: కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించి కుష్ఠు రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు వైద్యారోగ్యశాఖ అధికారులు సమష్టిగా కృషి చేయాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జొన్నాడ, ఆలమూరు, పెనికేరు గ్రామాల్లో సోమవారం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్లు పి.వి.రమణారావు, పి.ఉమ విచ్చేసి కుష్ఠు వ్యాధి నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు.